సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 20 । మార్చి । 2023



9 ఎర్రచందనం దుంగల స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 9 ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. -8లో..



సిద్దయ్య మఠం ఉత్సవాలకు ముస్తాబు

పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడు సిద్దయ్యస్వామి కొలువైన మఠం ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.148
రెండోరకం	రూ.70	రూ.100



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 149 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	540	542
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 87.66 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారంలో భాగంగా కలెక్టరేట్‌లో ఈ నెల 20న స్పందన కార్యక్రమం జరగనుంది. ఈమేరకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా స్పందన కార్యక్రమాన్ని జరుగుతందని తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసు



మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు స్థానిక 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5, 6 గంటలకు మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు నేరుగా బస్సులు నడుస్తాయన్నారు. అనంతరం తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు సర్వీసులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాలని కోరారు.

26న శ్రీహరికోటకు ప్రత్యేక సర్వీసు : పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో శ్రీహరికోట సందర్శనం కోసం విద్యార్థుల కోసం ఈనెల 26న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. శ్రీహరికోటలో ఉపగ్రహ ప్రయోగం ఉన్నందున 25 రాత్రి బస్టాండు నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25న వాహనాల వేలం

బి.కొత్తకోట: అక్రమమద్యం తరలిస్తూ పట్టుబడి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 25న వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రామమోహన్ ఆదివారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని సీజ్ వాహనాల్లో 12 బైక్‌లు, మూడు కార్లు, మూడు ఆటోలకు వేలం నిర్వహణ ఉంటుందని తెలిపారు.

26న సాహితీ సదస్సు

కడప కల్చరల్(వైఎస్సార్ జిల్లా): నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 118వ సదస్సుగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 1950 నుంచి 2000 సంవత్సరం వరకు రాయలసీమ సాంఘిక నాటకాలు అనే అంశంపై వైవీయూ తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి ఓబిలి వెంకటయ్య ప్రసంగించనున్నట్లు ఆయన తెలిపారు.


26న పోలీస్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ సమావేశం

కడప అర్బన్(వైఎస్సార్ జిల్లా) : దేవుని కడప పోలీసు డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం మహాజన సభ ద్వితీయ అర్ధసంవత్సర (2022-2023) సమావేశం ఈనెల 26న ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ పోలీసు కాలనీ, కడప కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

ఉర్దూ విద్యాసంస్థలకు ఒంటిపూట బడి నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 23వ తేదీ నుంచి పవిత్రమైన రంజాన్‌మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఉర్దూ మీడియం విద్యాసంస్థలకు ఒంటిపూట బడి నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని రూటా రాష్ట్ర అధ్యక్షుడు లయన్ ఇబాబ్‌బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది అందరూ ఉపవాసం ఉంటారని అందువల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని వారు సూచించారు.

లేపాక్షి వస్తువులపై తగ్గింపు ధరలు



కడప కల్చరల్ (వైఎస్సార్ జిల్లా): లేపాక్షి ఎంపోరియంలోని వస్తువులను తగ్గింపు ధరలకు అందజేస్తున్నామని షోరూం ఇన్‌చార్జి మేనేజర్ వీపీ వెంకటేశన్ తెలిపారు. ప్రత్యేక ఆఫర్ కింద షోరూంలోని కొండపల్లి, ఏటికొప్పాక, రోజ్‌వుడ్, మెటల్ బొమ్మలు, ఫోటో ఫ్రేమ్‌లు, లెదర్ పప్పెట్లు,ల్యాంప్ షేడ్లుతోపాటు ఆకర్షణీయమైన చేనేత వస్త్రాలను కూడా 10 నుంచి 40 శాతం వరకు తగ్గింపు ధరలపై అందజేస్తున్నామన్నారు. ఈనెల 31 వరకు ఈ ఆఫర్ ఉంటుందని, ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు షోరూం పనిచేస్తుందని తెలిపారు.

దెబ్బమీద దెబ్బ

అకాల వర్షానికి అన్నదాత కుదేలు

- 501.18 ఎకరాల్లో దెబ్బతిన్న పండ్లతోటలు, 61.4 హెక్టార్లలో ప్రొద్దుతిరుగుడు, వరి
- రూ. 6 కోట్ల మేర పంటనష్టం

సాక్షి నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన తేమ గాలుల ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు అన్నదాత కుదైలైపోయాడు. కళ్ల ముందు పచ్చగా కనిపిస్తున్న పంట వడగండ్ల వర్షం దెబ్బకు నేల రాలిపోవడంతో దిక్కుతోచక ఆందోళనకు లోనవుతున్నాడు. మొదటి రెండు రోజులు మదనపల్లి డివిజన్ పరిధిలో వడగళ్ల వర్షం, ఈదురు గాలులతో పండ్లతోటలు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా మామిడి, బొప్పాయి, అరటి, టమాటా, వరి, ప్రొద్దు తిరుగుడు తదితర పంటలు దెబ్బతిని రైతులకు నష్టాన్ని చేకూర్చాయి. జిల్లాలో 501.18 ఎకరాల్లో పండ్లతోటలు దెబ్బతిన్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి చంద్రబాబు తెలిపారు. అలాగే పొద్దు తిరుగుడు 31.2 హెక్టార్లు, వరి, నువ్వులు, జొన్న తదితర పంటలు 30.2 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. అన్నమయ్య జిల్లా పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 6 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది.



రాజంపేటరూరల్: ఆకేపాడులో నేలకొరిగిన అరటి

- గాలులతో కురిసిన వర్షానికి రాజంపేట రూరల్ మండలంలో 50 మంది రైతులకు చెందిన 153 ఎకరాల అరటిపంట నేలకొరిగింది. దాదాపు రూ. 1.50 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. 5 ఎకరాలలో కూరగాయల తోటలు, 5 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట దెబ్బతింది. మండల పరిధిలోని హస్తవరం, పెద్దకారంపల్లి, ఆకేపాడు, మిట్టమీదపల్లి, బ్రాహ్మణపల్లి, గుండ్లూరు పంచాయతీల పరిధిలో అరటితోలు నెలకొరిగాయి.
- చిట్వేలి మండలంలోని కెఎస్ అగ్రహారంలో 15 , రాజుకుంటలో 2 ఎకరాలు, నగిరిపాడులో 2 ఎకరాలు, దేవమాచుపల్లిలో 4 ఎకరాల్లో అరటి, మాలేమార్పురంలో 20 ఎకరాల్లో మొక్కజొన్న, 7 ఎకరాల్లో కర్బూజ పంటలు ధ్వంసమయ్యాయి. వ్యవసాయ సహాయకులు శ్రీరామ్, కళ్యాణి,పావని, నరసింహులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పంటలను పరిశీలించి ప్రాథమి అంచనా చేశామని, ఈ సమాచారాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్ళి ఉన్నతాధికారులకు నివేదించి రైతులకు నష్టపరిహారం మంజూరుకు కృషి చేస్తామన్నారు.
- గుర్రంకొండ మండలంలో శనివారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. దీంతో మండలం మొత్తం 120 ఎకరాల్లో మామిడితోటలు, 450 ఎకరాల్లో టమాటా,25 ఎకరాల్లో పూలతోటలు, 15 ఎకరాల్లో కర్బూజా తోటలు దెబ్బతిన్నాయి. గంగిరెడ్డిపల్లెలో కాపునకు వచ్చిన మామిడికాయలు గాలులకు రాలిపోయాయి.
- తంబళ్లపల్లె మండలం రెడ్డికోట పంచాయతీ మేకలవాండ్లపల్లెలో దోస, టామాటా పంటలు దెబ్బతిన్నాయి.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

కుంభంవారిపల్లి	: 90.4	లక్కిరెడ్డిపల్లి	:32.8
పీలేరు	: 78.2	వాల్మీకిపురం	:25.2
రాజంపేట	: 75.2	పెద్దమండెం	:19.6
కురబలకోట	: 74	సుండుపల్లి	:20.2
గాలివీడు	: 63.8	మదనపల్లి	:17.6
గుర్రంకొండ	: 62	పుల్లంపేట	:17.4
కలకడ	: 60.4	ఓబులవారిపల్లి	: 14
రామాపురం	: 50.2	రామసముద్రం	: 14
నందలూరు	: 46.8	ములకలచెరువు	: 11.6
కలికిరి	: 46	వీరబల్లి	:10.4
చిన్నమండెం	: 46	కోడూరు	:8.8
నిమనపల్లి	: 45.4	బి కొత్తకోట	:8.4,
చిట్వేలి	: 44.6	పెద్దతిప్ప	:
పెనగలూరు	: 42	సముద్రం	:4
సంబేపల్లి	: 42.2	తంబళ్లపల్లి	:2



గుర్రంకొండలో భారీ సైజులో వడగండ్లు



చిట్వేలి: మాలేమార్పురంలో పడిపోయిన మొక్కజొన్న పంట



కలకడ: వెంగన్నగారిపల్లెలో కూలిపోయిన కొబ్బరిచెట్టు



తంబళ్లపల్లె: వర్షపునీటితో నిండిన దోసపంట



గుర్రంకొండ: గంగిరెడ్డిపల్లెలో రాలిపోయిన మామిడికాయలు

విశ్వసనీయతకు పట్టం కట్టారు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు విశ్వసనీయతకు పట్టం కట్టారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాకతీయ విద్యాసంస్థల ఆడిటోరియంలో ఆదివారం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన మిట్టా వెంకట రామచంద్రారెడ్డికి ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకులు చొప్పా ఎల్లారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉపాధ్యాయులకు అండగా నిలవడం వల్లే ఎమ్మెల్సీ ఎన్నికలలో రామచంద్రారెడ్డిని గెలిపించారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వెంకటరామచంద్రారెడ్డి ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపే వారని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా గెలిచిన వెంకటరామచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించిన ప్రతి ఒక ఉపాధ్యాయునికి కృతజ్ఞతలు తెలిపారు.



రామచంద్రారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అపూస్మ ప్రతినిధులు

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ప్రైవేటు అసోసియేషన్ ప్రతినిధులు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వై.నందకిషోర్ గౌడ్, ఏ.ప్రభాకర్ నాయుడు, జి.రెడ్డయ్య, ఎస్.రవీంద్ర, వెంకటసుబ్బయ్య, అపూస్మ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు గంగయ్య, కార్యదర్శి రమణారెడ్డి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, పుల్లంపేట ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

దేశ సేవలో సీఆర్‌పీఎఫ్‌కు ప్రత్యేక స్థానం

కలికిరి: దేశ సేవలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)కు ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉందని కలికిరి సీఆర్‌పీఎఫ్ కేంద్రం సెకెండ్ ఇన్ కమాండెంట్ కేసీ నిర్మల్ అన్నారు. సీఆర్‌పీఎఫ్ 84వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం క్యాంపు కార్యాలయంలో సమావేశం, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపం (క్వార్టర్ గార్డ్) వద్ద పుష్పగుచ్ఛంతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీస్ పేరుతో 1939 జూలై 27న మధ్యప్రదేశ్‌లో ప్రారంభమై, స్వాతంత్య్రం అనంతరం 1949 డిసెంబర్ 28న సీఆర్‌పీఎఫ్‌గా పేరు మార్చడం జరిగిందన్నారు. 1950 మార్చి 19న రాష్ట్రపతిచే గుర్తింపు పొంది దేశ సేవ చేయడానికి, బలమైన ప్రాత పోషించడానికి వీలు కల్పించినట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జవాన్‌లు, అధికారులకు వాలీబాల్ క్రీడా పోటీలు, బడాఖానా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్‌లు ఏకే సింగ్, శివప్రసాద్, కదమ్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు హనుమాన్‌రామ్, రవికుమార్, గిరిధర్, జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



క్వార్టర్ గార్డ్ వద్ద నివాళులు అర్పిస్తున్న సెకెండ్ ఇన్ కమాండెంట్ కేసీ నిర్మల్

ఘనంగా ముద్దల పండుగ

పెండ్లిమర్రి : వైఎస్సార్ జిల్లా నాగాయపల్లె, కారపురెడ్డిపల్లె, కొండూరు, కొత్తసంగటిపల్లె, మర్రిమాకులపల్లె, రేపల్లె, పగడాలపల్లె, చెన్నంరాజుపల్లె, గంగులయ్యగారిపల్లె, మాచునూరు తదితర గ్రామాలల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్ళల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకుని జంతువులను బలి ఇచ్చి విందు భోజనాలు అరగించి బంధు మిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. పాతసంగటిపల్లె గ్రామంలో గ్రామ దేవత జాతర ఎద్దులచే సిరిబండి కట్టి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు.



పాతసంగటిపల్లెలో సిరిబండితో జాతర నిర్వహిస్తున్న గ్రామస్తులు

రాములోరి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

- వచ్చే నెల 5న పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎం
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

ఒంటిమిట్ట(రాజంపేట): జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో ఒంటిమిట్ట కోదండ రాముని బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బ్రహ్మోత్సవాల నిర్వహణపై స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదండరాముని కళ్యాణం భక్తులు కనులారా వీక్షించేలా సదుపాయాలు కల్పించాలని సూచించారు.మార్చి 31 నాటికి కల్యాణోత్సవ ఏర్పాట్లు పూర్తికావాలన్నారు. కల్యాణ వేదిక వద్ద సీసీకెమెరాలు, బ్యారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెలాఖరులో మరోసారి పనుల పురోగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 5న సీతారాముల కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారన్నారు. వైఎస్సార్ జిల్లా కలెక్టరు విజయరామరాజు మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందన్నారు. భద్రత, పార్కింగ్, పారిశుధ్యం, తాత్కలిక మరుగుదొడ్లు, నిరంతరం విద్యుత్ సరఫరా, వీఐపీ పాసులు,హెల్ప్‌డెస్క్‌లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికారులతో పాటు టీటీడీలోని ఆయా విభాగాధిపతులతో కమిటీలు నియమించామన్నారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ కల్యాణోత్సవానికి 4 వేల మందితో బందోబస్తును ఏర్పాటుచేస్తున్నామన్నారు. రెండు రోజుల ముందు నుంచే పోలీసులు విధుల్లో ఉంటారన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు

కల్యాణవేదిక పనుల పరిశీలన

కలెక్టర్, ఈవో, ఎస్పీలు కల్యాణవేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు, ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ పనులు వేగవంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం ఈవో, కలెక్టరు ,ఎస్పీలు కోదండరామస్వామి ఆలయం, కల్యాణవేదికకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్, గైడ్‌లైన్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, ఓఎస్డీ రఘునాథ్, డ్వామా , డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనందనాయక్, డీఎస్పీ శివారెడ్డి, వ్యవసాయశాఖ జెడీ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనువాసులరెడ్డి, డీటీసీ మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, టీటీడీ పీఆర్వో రవి,ఓఎస్డీ నగేష్, సమాచారశాఖ ఏడీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎండీసీ పీడీ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయచోటి : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు డాక్టర్ శివానాయక్, రామమూర్తినాయక్, అర్జున్‌నాయక్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వెంకటస్వామినాయక్‌లు తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని సాదిక్‌నగర్‌లో అన్నమయ్య జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.అమ్రునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బిల్లునాయక్, జిల్లా కోశాధికారిగా నారాయణనాయక్‌ను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ సలహాదారులు, గౌరవ అధ్యక్షులుగా పంచాయతీరాజ్ డీఈఈ రామచంద్రనాయక్, ట్రాన్స్‌కో ఏడీ చిన్నస్వామి నాయక్, ఎంపీడీఓ శేఖర్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా అశోక్‌నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ హరిప్రియలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా మీడియా అధ్యక్షునిగా ధర్మానాయక్, అలాగే ఆర్గనైజింగ్ సెక్రటరీ మూడే రవీంద్రనాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు శంకర్‌నాయక్, ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం కార్యవర్గ సభ్యులు దేవలానాయక్, నాగరాజునాయక్, గోపీనాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, జగన్‌నాయక్, రామ్మూర్తినాయక్, నాగమునినాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కారాదు



విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా అధికారులు

- జిల్లా అధికారులు సందప్ప, జాకీర్ హుస్సేన్
- జిల్లాలో 32,458 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ. 23.62 కోట్లు జమ

రాయచోటి: పిల్లల ఉన్నత చదువులు తల్లిదండ్రులకు ఏమాత్రం భారం కాకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా బీసీ సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సందప్ప, జాకీర్ హుస్సేన్‌లు సంయుక్తంగా పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన లబ్ధి మొత్తాన్ని ల్యాప్‌టాప్ బటన్ నొక్కి అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు.అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి జిల్లా బీసీ సంక్షేమశాఖ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి సభ అనంతరం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్నమయ్య జిల్లాలోని 35,656 మంది విద్యార్థులకు 32,458 మందికి మంజూరైన జగనన్న విద్యాదీవెన లబ్ధి మొత్తం రూ. 23.62 కోట్లు మెగా చెక్కును విద్యార్థులు వారి తల్లుల చేతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం ఉన్నతస్థాయి చదువులను చదివే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. లబ్ధి పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. జగనన్న విద్యా దీవెన అనే పథకం రాష్ట్రంలో ఐటీఐ, డిప్లమా, డిగ్రీ ఆపైస్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ముఖ్యమంత్రి అందిస్తున్న సువర్ణ అవకాశం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా దీవెన సాయం అందుకుని చదువుపై ఏకాగ్రతతో భవిష్యత్ లక్ష్యంవైపు అడుగులేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర ప్రొఫిషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఆవు మృతి


మృతి చెందిన ఆవు, దూడను పరిశీలిస్తున్న పశు వైద్యులు

చిట్వేలి : రాజుకుంట పంచాయతీలోని చింతల చెలిక గ్రామంలో శుక్రవారం రాత్రి 8.45 గంటల సమయంలో పిడుగు పడగా వంకర శంకరయ్యకు చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పశు వైద్యులు భువనేశ్వరీ, ఆర్‌ఐ శేషంరాజు, వీఆర్‌ఓ రఘుపతి శనివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ భువనేశ్వరీ మాట్లాడుతూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించి రైతుకు నష్టపరిహారం మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు నారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

చెరువు పోరంబోకు భూమి కబ్జా


రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

పీలేరు : కోట్లాది రూపాయల విలువైన చెరువు పోరంబోకు భూమి దర్జాగా కబ్జా చేసి రేకుల షెడ్డు నిర్మిస్తున్న ఘటన పీలేరు పట్టణ శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. సర్వే నంబరు 30లో పీలేరు – తిరుపతి జాతీయ రహదారికి పక్కన చెరువు పోరంబోకు భూమి ఉంది. ఈ ప్రాంతంలో భూములకు చాలా విలువ ఉండటంతో ఆక్రమణదారులు పలుమార్లు ఆక్రమణకు ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించి ఆక్రమణకు గురి కాకుండా కాపాడుతూ వచ్చారు. ఆరు నెలల క్రితం ఈ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం హెచ్చరిక బోర్డులను సైతం తొలగించి రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు పోరంబోకు భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.


గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్)

భాషకు పట్టం.. సాహిత్యానికి పీఠం..!

- 22న మరసం రజతోత్సవం
- ఉగాది వేడుకలు, కవి సమ్మేళనం

మదనపల్లె సిటీ : ఆ మిత్ర బృందానికి ఒకటే లక్ష్యం. సాహితీ సేద్యంలో భాషామృత ఫలాలను పండించి యువతకు అందించాలని ఆశించారు. విభిన్న వృత్తుల్లో క్షణం తీరిక దొరకని వారైనా.. నిరంతర అన్వేషణ మాత్రం తెలుగు భాషకు వెలుగునివ్వడమే. ఈ మిత్ర మండలి కలకల సాధనమే మదనపల్లె రచయితల సంఘం (మరసం). ఆ సంస్థ ఉగాదికి రజతోత్సవాలను నిర్వహించడానికి సిద్ధమవుతోంది. 1997లో బీటీ కాలేజీ రిటైర్డు తెలుగు అధ్యాపకులు మల్లెల గురవయ్య, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కరణం బాలసుబ్రమణ్యం పిళ్లై, సీనియర్ జర్నలిస్టు పురాణం త్యాగమూర్తిశర్మ, తొలి మహిళా న్యూస్ రీడర్ జోశిపాలెం మంగమ్మ, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత వల్లంపాటి వెంకటసుబ్బయ్య తదితరులు తన మిత్ర బృందంతో కలిసి స్థానిక బెంగుళూరు రోడ్డులోని జిజ్ఞాస భవనంలో సంస్థను నెలకొల్పారు. ఈ పాతికేళ్లలో ఏటా ఉగాది రోజున కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఎంతో మంది కవులను ప్రోత్సహిస్తున్నారు. నూతన గ్రంథాలను సమీక్షలు నిర్వహించడంతోపాటు వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. తెలుగు భాష కోసం పాఠశాలల్లో కథల పోటీలు, ఏటా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మరసం గౌరవ అధ్యక్షులుగా పురాణం త్యాగమూర్తిశర్మ, అధ్యక్షులుగా ఇంజనీర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా యుగంధరాచారి, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య, శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు.



మరసం కార్యాలయం, మరసం రజతోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మరసం సభ్యులు

కార్యశాలలు, సదస్సులు.. పోటీలు

తెలుగు భాషాభివృద్ధి కోసం మరసం కార్యశాలలు, సదస్సులను ప్రత్యేకంగా నిర్వహిస్తుంటుంది. ప్రతి వారం మరసం కార్యాలయంలో సాహితీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే భాష, బోధన విషయంలో సరిదిద్దుకుంటూ రావాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా యువ రచయితలకు పద్య రచన, పాఠ్యాంశ బోధనల్లో కార్యశాలలను నిర్వహించింది. పద్య రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. ఇదంతా నిరంతరం తమ విధిగా మరసం భావించడం ఓ ప్రత్యేకత.

పండుగంటే పండగే : మరసం వారు ఉగాది పండుగ రోజు సాయంత్రం అయిదు గంటల నుంచి కార్యక్రమాలు మొదలు పెడతారు. కవి సమ్మేళనం, నాటకాలు, కవితలు మొదలగువని నిర్వహిస్తున్నారు. కవులకు సన్మానంతోపాటు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేస్తున్నారు.

సంస్కృతిని కాపాడటం కోసమే..


పాతికేళ్లుగా కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. ఇదంతా కేవలం తెలుగు భాషా సంస్కృతులను నిలపడం కోసమే. ఉగాది ఉత్సవానికి ఆడ, మగ అందరూ సంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరేది సంస్కృతిని కాపాడదామనే. ఉగాది పండుగ రోజు మా కార్యక్రమానికి వచ్చిన వారు రాత్రి వరకు జరిగే కవితా ప్రదర్శనలను ఆస్వాదిస్తారు. మళ్లీ ఉగాది కోసం ఎదురు చూస్తుంటారు. కవి సమ్మేళనం, నాటకాలు నిర్వహించి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నాం.

– లింగాల యుగంధరాచారి, ప్రధాన కార్యదర్శి, మరసం

22న రజతోత్సవం


మరసం రజతోత్సవ వేడుకలు ఈనెల 22న నిర్వహిస్తున్నాం. 25 ఏళ్ల ప్రస్థానంలో ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తాం. అన్నమయ్య కీర్తనలు, మురళీవేణుగానం, కవితాపఠనం, బలరాముడు ఏకాపాత్రాభినయం తదితర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం కవి సమ్మేళనం జరుగుతుంది. సాహితీవేత్తలు, పట్టణ ప్రముఖులు రజతోత్సవ వేడకలు విజయవంతం చేయాలి.

– పి.వి.ప్రసాద్, మరసం అధ్యక్షులు, మదనపల్లె

ఇరు వర్గాలపై కేసు నమోదు

కలకడ : ఇరు వర్గాల ఘర్షణలో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్‌లు రమేష్, రెడ్డిబాబు తెలిపారు. కలకడ టౌన్ పఠాన్ వీధికి చెందిన దర్బార్ అల్లీఖాన్ భార్య అప్రోజ్‌ను అదే వీధికి చెందిన ఐదుగురు ఈ నెల 16న కొట్టి గాయపరిచారు. బాధితురాలు అప్రోజ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలకడ టౌన్‌కు చెందిన అప్రోజ్ చెల్లెలు భాను, భాను కుమార్తె షబానా, చిన్నమ్మ మస్తానీ, తమ్ముడు జహీర్, కుమారుడు జవహర్‌పై హెడ్ కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్షద్ భార్య భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలకడ గ్రామానికి చెందిన దర్బార్ అల్లీఖాన్, మస్తానీ, ఇమ్రాన్, అప్రోజ్, అఫీస్‌పై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (70) ఈ నెల 15న చికిత్స కోసం చేరాడు. కార్డియో పల్మనరీతో బాధపడుతూ ఈ నెల 18న మృతి చెందాడు. అతని వద్ద వున్న ఆధార్ కార్డు ప్రకారం.. చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన నల్లోలి తిరుపాలు (70)గా గుర్తించారు. అతని బంధువులు ఎవరైనా వుంటే మృతదేహం కోసం తమను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు ఆదివారం తెలియజేశారు.

చౌడసముద్రంలో టీడీపీ ఓవర్‌యాక్షన్

- డీజే ఏర్పాటు చేసి అత్యుత్సాహం
- స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై ఘర్షణకు దిగిన టీడీపీ నాయకులు
- పోలీసుల రాకతో సమసిన వివాదం


చౌడసముద్రంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ములకలచెరువు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపొందడంతో మండలంలోని చౌడసముద్రంలో టీడీపీ నాయకులు ఆదివారం పోలీసుల అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసి టపాసులు పేల్చడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగించి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇలా చేయడం తప్పని స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించడంతో వారిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఈలలు వేస్తూ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దూసుకొచ్చారు. ఎంత వారించినా తగ్గకుండా ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. తమ టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలుపొందారు.. విజయోత్సవం చేసుకోకూడదా అంటూ కేకలు వేస్తూ ఉద్రిక్తత పరిస్థితులను నెలకొల్పారు. దీనితో తోపులాటకు దారి తీసింది. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేసేది లేక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చి ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెటింగ్ నిర్వహించారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు: సీఐ

చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ సాదిక్ అలీ హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయంలో చౌడసముద్రం వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, లోకేష్ పర్యటన అనంతరం చోటుచేసుకుంటున్న ఘటనలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో గొడవలు సృష్టించడం, ప్రజలకు భయభ్రాంతులను గురి చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఇది చివరి అవకాశం అని, మరోసారి పునరావృతమైతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని పేర్కొన్నారు.


సీఐ సాదిక్ అలీ

ఆటో, వ్యాన్ ఢీ.. ఒకరికి గాయాలు

రాజంపేట : పట్టణ శివారులోని మునక్కాయపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి మినీవ్యాన్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నందలూరు మండలం అరవపల్లెకు చెందిన మహమ్మద్‌రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య?

10 రోజుల క్రితం మరణించినట్లు గుర్తింపు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరు సమీపాన నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఓ వ్యక్తి విషద్రావణం తాగి మరణించి ఉండవచ్చని పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలలోకి వెళితే.. మృతదేహం కుళ్లిన వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడిని ఓబులవారిపల్లి మండలం బాల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దనపాటి నరేంద్ర ఆచారి (45)గా గుర్తించారు. అతను 10 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చు. మృతికి వివరాలు తెలియాల్సి వుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


నందిని (ఫైల్)

మదనపల్లె : మదనపల్లెలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆదివారం సాయంత్రం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నక్కలదిన్నెతండాకు చెందిన ప్రవీణ్‌కుమార్‌నాయక్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు తొమ్మిది నెలల క్రితం కుప్పం మండలం వీర్నమల్ల తండాకు చెందిన నందిని(20)తో వివాహం జరిగింది. వారం క్రితం నందిని పుట్టినిల్లు వీర్నమల్లతండాకు వెళ్లి.. రెండు రోజుల క్రితం అత్తగారి ఇంటికి వచ్చింది. ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలీ పనుల నుంచి ఇంటికి చేరుకున్న భర్త ప్రవీణ్‌కుమార్ చూచి కేకలు వేయడంతో స్థానికులు ఇంట్లోకి వచ్చి చూశారు. అనంతరం ఆత్మహత్య సమాచారాన్ని పోలీసులకు అందించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ హెడ్‌కానిస్టేబుల్ మోహన్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె ఆత్మహత్య చేసుకున్న తీరుపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధించే వారని, ఈ క్రమంలో వారం రోజుల క్రితం నందిని పుట్టినింటికి వెళ్లి వచ్చిందని మృతురాలి పెద్దమ్మ తెలిపారు. పుట్టింటి నుంచి కట్న కానుకలు తెస్తే బాగా చూసుకునే వారని, లేకుంటే పరుషంగా వ్యవహరించే వారని పోలీసులకు చెప్పారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సిద్దయ్య మఠం ఉత్సవాలకు ముస్తాబు

- 22న పెద్దపీరయ్యస్వామి ఆరాధన
- బ్రహ్మంగారి కానుకల ప్రదర్శన

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడు సిద్దయ్యస్వామి కొలువైన మఠం ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. మండలంలోని ముడుమాలలో ఈ మఠం ఉంది. సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం పెద్దపీరయ్యస్వామికి పూల పూజ, ప్రత్యేక వస్త్రాలంకరణ కార్యక్రమాలు చేపడతారు. రాత్రి గ్రామోత్సవం, భజనలు, డ్రామాలు, అన్నదానాలు ఉంటాయి.

బండలాగుడు పోటీలు

గురువారం మహాప్రసాద వినియోగం ఉంటుంది. బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఉదయం చిన్న బండలాగుడు పోటీలు ఉంటాయి. మొదటి, రెండు, మూడు, నాలుగు బహుమతులు వరుసగా రూ.30,016, రూ.20,016, రూ.15,016, రూ.5,016 ఇవ్వనున్నారు. మధ్యాహ్నం పెద్దబండ పోటీలు ఉంటాయి. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదవ బహుమతులు వరుసగా రూ.75,016, రూ.50,016, రూ.30,016, రూ.15,116, రూ.10,116 ఇస్తారు. మనుముల గుండు ఎత్తే పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.


ముడుమాలలోని సిద్దయ్యస్వామి మఠం


బ్రహ్మంగారు నాడు సిద్దయ్యకు ఇచ్చిన కానుకలు

ఉగాది సందర్భంగా..

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆనాడు సిద్దయ్యకు ఇచ్చిన గురుకానుకలను భక్తుల దర్శనం కోసం ఉంచనున్నారు. శిఖాముద్రిక, యోగదండన, తాళపత్రాలు, పాదుకలను ఉగాది సందర్భంగా బుధవారం భక్తుల దర్శనం కోసం ఉంచుతారు. వాటిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఉత్సవాల కోసం మఠాధిపతులు, శిష్యబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

9 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

పీలేరు : అక్రమంగా తరలిస్తున్న 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం ఒరుగుపల్లె వద్ద అటవీ సిబ్బంది నిఘా ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అతివేగంగా వచ్చిన బొలేరో వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించడంతో.. వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి చీకటిలో పరారయ్యారు. వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుపడిన వాహనం, 269 కేజీల బరువు గల 9 ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు.

మహావీర్ మ్యూజియానికి మంచి రోజులు

- ఆమోదం కోసం మైలవరం మ్యూజియం డీపీఆర్
- విశాఖలో వైఎస్సార్ పేరిట స్టేట్ మ్యూజియం
- జిల్లాలోని శాసనాలకు లభించనున్న రక్షణ


మహావీర్ మ్యూజియం


మ్యూజియం ఆవరణలో చెల్లాచెదురుగా శిల్పాలు

కడప కల్చరల్ : కడప నగరంలోని భగవాన్ మహావీర్ మ్యూజియంకు మంచిరోజులు రానున్నాయి. దాంతోపాటు జమ్మలమడుగు సమీపాన గల మైలవరం రిజర్వాయర్ వద్దనున్న మ్యూజియంకు కూడా మహర్దశ పట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర పురావస్తుశాఖ ప్రయత్నాలు చేస్తోంది. శిథిల భవనాలలో నడుస్తున్న మ్యూజియంలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తొలిదశలో కడప నగరంలోని మహావీర్ మ్యూజియం, అనంతరం మైలవరం మ్యూజియంలకు శిథిల భవనాల స్థానంలో నూతన భవనాలు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకతలు గల శిల్పాలు, శాసనాలు, పురాతన వస్తువులతో విశాఖపట్టణంలో వైఎస్సార్ స్టేట్ మ్యూజియంను నిర్మించనున్నారు.

41 ఏళ్ల క్రితం నిర్మాణం

కడప మహావీర్ మ్యూజియం గురించి జిల్లా వాసులందరికీ తెలిసిందే. 41 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని కలెక్టరేట్ సర్కిల్‌లో స్థానిక జైనుల సహకారంతో మ్యూజియం నిర్మించారు. జైనులు తమ ఆరాధ్యదైవమైన భగవాన్ మహావీరుని పేరిట ఈ మ్యూజియాన్ని నిర్మింపజేశారు. నాటి ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ భవనాన్ని ప్రారంభించగా, పురావస్తుశాఖ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి శిల్ప శాసన విభాగాన్ని ప్రారంభించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆ ప్రాంతంలో లభించిన శిల్పాలు, శాసనాలు, జిల్లాలోని ఇతర ప్రాంతాలలో లభించిన అన్నింటినీ ఈ మ్యూజియంకు చేర్చారు. ఇందులో పదుల సంఖ్యలో అరుదైన శాసనాలు దాదాపు 100కు పైగా విభిన్న శిల్పకళాశైలిని తెలిపే శిల్పాలు, పురాతన ఖడ్గాలు, వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. 15 ఏళ్లపాటు మ్యూజియం సందర్శకులతో కళకళలాడింది. కాలానుగుణ మార్పులు, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో సందర్శకుల సంఖ్య తగ్గింది. భవనం పూర్తిగా దెబ్బతినింది. వర్షం వస్తే పైకప్పు పూర్తిగా నీరు కారుతూ తడిచి ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయం గొల్పుతోంది. అడపాదడపా వచ్చిన సందర్శకులపై పైకప్పు గచ్చులు ఊడిపడుతుండడంతో వారి రాక పూర్తిగా తగ్గిపోయింది. సాక్షాత్తు ఓ కలెక్టరే దానిని బూత్‌బంగ్లాగా అభివర్ణించారు. ఓ ఉద్యోగి మినహా అందులో ఎవరూ ఉండడం లేదు. ఇటీవల నూతన కలెక్టరేట్ నిర్మాణ సమయంలో వెలుపలి వైపు పూర్తిగా గోడ కట్టడంతో మ్యూజియం పూర్తిగా కనపడటం లేదు.

కొత్త భవనం అవకాశం

రాష్ట్రంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నడుస్తూ శిథిల స్థితికి చేరుకున్న మ్యూజియంలకు కొత్త భవనాలను నిర్మించేందుకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సందర్శకులకు శిల్పాలు, శాసనాలు స్పష్టంగా కనిపించేలా పూర్తి స్థాయి రక్షణతో వీటిని నిర్మించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఇటీవల రాష్ట్ర పురావస్తుశాఖ కమిషనర్ జి.వాణిమోహన్ ప్రకటించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని మహావీర్ మ్యూజియం నూతన భవన నిర్మాణాలకు రూ.10 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని మైలవరం మ్యూజియానికి కూడా నూతన భవనాలు కావాలంటూ స్థానిక పురావస్తుశాఖ అధికారులు కోరడంతో సంబంధిత అధికారులు దాన్ని కూడా పునర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

శాసనాల రక్షణ కోసం ప్రత్యేక మ్యూజియం

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మరెక్కడా లేనన్ని శాసనాలు కేవలం మన రాష్ట్రంలో ముఖ్యంగా వైఎస్సార్ జిల్లాలో లభించాయన్న విషయం తెలిసిందే. తొలి తెలుగు శాసనమైన కలమల్ల శాసనం కూడా మన జిల్లాలోనే లభించింది. రెండో శాసనం సమీపంలోని ఎర్రగుడిపాడులో వెలుగు చూసింది.

ఇంకా కేవలం తెలుగు శాసనాలే కాకుండా అరబ్బీ, ఉర్దూ, ఆంగ్ల శాసనాలు కూడా జిల్లాలో లభించినట్లు తెలుస్తోంది. గండికోటలోనూ, లోయ గ్రామాలలోనూ దాదాపు 1000 శాసనాలు ఉన్నట్లు ఆ శాఖ నిపుణులు తెలుపుతున్నారు. రక్షణ లభించకపోవడంతో చరిత్రకు సాక్షాలుగా నిలిచి ఉన్న ఇలాంటి విలువైన వారసత్వ సంపద కళ్లముందే శిథిలమై పోతుండటం పట్ల పలువురు చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి శాసనాలను రక్షించడం కోసం రాష్ట్ర పురావస్తుశాఖ ప్రత్యేకంగా శాసన పరిరక్షణ కోసమే శాసన మ్యూజియం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. ఆ మ్యూజియం అందుబాటులోకి వస్తే మన జిల్లాలోని విలువైన శాసనాలకు శాశ్వతంగా రక్షణ లభించే అవకాశం ఉంది.